ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

బుధవారం | నవంబరు 04, 2026 | సంపుటి : 7 | సంచిక : 129 | పేజీలు : 2


భద్రకాళి మాత ఆలయంలో

చాగంటి పూజలు


2 లో

పురపోరులో కూటమి

జైత్రయాత్ర



పులివెందులలోనూ టీడీపీ జెండా రెపరెపలు

అమరావతి, ఆయుధం:
ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్ల కూటమి అభ్యర్థులు సత్తా చాటారు. జగన్ సొంత నియోజకవర్గం కడప జిల్లా పులివెందులలోనూ టీడీపీ జెండా రెపరెపలాడింది. తిరుపతి టీడీపీ మేయర్ అభ్యర్థి మన్నె శ్రీనివాస ప్రసాద్, చిత్తూరు మేయర్ అభ్యర్థి కఠారి హేమలత, గుంటూరు మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ ఘన విజయం సాధించారు. విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, కడప, మచిలీపట్నం కార్పొరేషన్‌లలో కూటమి అభ్యర్థులు ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల్లో నందికొట్కూరు మున్సిపాలిటీలో మాత్రమే వైకాపా గెలుపొందింది. ఆదోనిలో జనసేన రెబల్ స్వప్న విజయం సాధించారు. ప్రస్తుతం ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది.

కూటమి అభ్యర్థులు గెలుపొందిన మున్సిపాలిటీలు ఇవే..

టీడీపీ: నర్సీపట్నం, పలాస, ఇచ్ఛాపురం, పెద్దాపురం, కొవ్వూరు, మండపేట, ఆకివీడు, నూజివీడు, జగ్గయ్యపేట, జంగారెడ్డిగూడెం, ఉయ్యూరు, నందిగామ, జగ్గయ్యపేట, కొండపల్లి, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, రేపల్లె, కనిగిరి, ఆత్మకూరు(నెల్లూరు), ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు(నంద్యాల), కళ్యాణదుర్గం, తాడిపత్రి, గుత్తి, పెనుకొండ, కమలాపురం, రాజంపేట, ప్రొద్దుటూరు, బద్వేల్, మైదుకూరు, మదనపల్లి, పుంగనూరు, రాయచోటి, వెంకటగిరి, సూళ్లూరుపేట, పలమనేరు, కుప్పం, నగరి, పులివెందుల

జనసేన: గొల్లప్రోలు, తుని, సామర్లకోట, పిఠాపురం, ముమ్మిడివరం, అమలాపురం, నిడదవోలు, నర్సాపూర్, పెడన, తిరువూరు, తెనాలి, దర్శి, మడకశిర, పుట్టపర్తి

బీజేపీ: గూడూరు(కర్నూలు), ఎర్రగుంట్ల, ఎలమంచిలి



ఖేలో ఇండియా క్రీడలకు పక్కాగా ఏర్పాట్లు

- డిసెంబర్ 18 నుంచి 21 వరకు జేఎన్ఎస్ స్టేడియంలో జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలు
- 1,500 మంది క్రీడాకారులు, సాంకేతిక బృందాల రాక
- ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో సమీక్ష

హనుమకొండ, ఆయుధం: దేశవ్యాప్తంగా క్రీడాకారులు పాల్గొనే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల నిర్వహణకు హనుమకొండలో విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 18 నుంచి 21వ తేదీ వరకు హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో.... మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ పోటీలకు క్రీడాకారులు, అధికారులు, సాంకేతిక బృందాలు, కోచ్‌లు కలిపి సుమారు 1,500 మంది హాజరయ్యే అవకాశం ఉందని.. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కొత్త ప్రశాంత్ తెలిపారు. ఈ నేపథ్యంలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, భోజనం, రవాణా, వైద్య సేవలు, భద్రత, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయముగా పని చేయాలన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో... రెండు అంబులెన్సులు, వైద్య బృందాన్ని అందుబాటులో ఉండాలన్నారు. పోలీస్ శాఖ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టా లని... జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో స్టేడియం పరిసరాల్లో పరిశుభ్రత, పచ్చదనం, పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయాలు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. స్టేడియంలోని డయాస్‌కు ఇరువైపుల సీసీ ప్లాట్‌ఫారాల నిర్మాణ పనులు చేపట్టాలని ప్రతిపాదించారు. క్రీడాకారులకు భోజనం, వసతి, గుర్తింపు కార్డులు, క్రీడా పరికరాలు తదితర ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.రవి, జీడబ్ల్యూఎంసీ అధికారులు, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, ఏసీపీలు పి.నర్సింహారావు, టి.సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ ఈఈ దేవక చవాన్, జిల్లా యువజన క్రీడల అధికారి కొత్త ప్రశాంత్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సారంగపాణి ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భూభారతి పెండింగ్ దరఖాస్తులు..

రీసర్వే వేగవంతం చేయాలి

- ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను కేటాయించాలి
- జీవో 59, 76 పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి
- హైకోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్



ములుగు, ఆయుధం: భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంతోపాటు రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల రెవెన్యూ అదనపు కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విజిలెన్స్ కేసులు, భూదాన్ నివేదిక, రీసర్వే, హైకోర్టు కేసులు, భూభారతి పాత, కొత్త పెండింగ్ దరఖాస్తులు, భూసేకరణ, భూముల క్రమబద్ధీకరణ అంశాలపై ఆయన సమీక్షించారు. ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ కుమార్ మాట్లాడుతూ, భూభారతి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. పాత, కొత్త దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. రీసర్వేను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పూర్తి చేసేందుకు ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను కేటాయించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రీసర్వే ప్రక్రియ వేగంగా జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జీవో నంబర్లు 59, 76 కింద పెండింగ్‌లో ఉన్న క్రమబద్ధీకరణ దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. యూఎల్‌సీ భూములు, జీవో నంబర్ 118కు సంబంధించిన పెండింగ్ అంశాలపైనా సమీక్షించారు. హైకోర్టు పరిధిలో ఉన్న భూ సంబంధిత కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విజిలెన్స్ కేసులు, భూదాన్ నివేదిక, భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాల పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, ఏవో రాజ్‌కుమార్, పర్యవేక్షకులు మహేష్ బాబు, మంజుల, తహసీల్దార్ విజయభాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి

ప్రత్యేక కార్యాచరణ

- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి...
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా సర్వోత్తం రెడ్డిని గెలిపించాలి..
- కాకతీయ యూనివర్సిటీలో ఉద్యోగులు, విద్యార్థులు, మేధావులతో ఆత్మీయ సమావేశం...



హనుమకొండ, ఆయుధం: కాకతీయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి, విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, విశ్వవిద్యాలయానికి అవసరమైన నిధులు, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డికి పట్టభద్రులు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఉద్యోగులు, విద్యార్థులు, మేధావులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గంద్ర సత్యనారాయణ రావు, శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, అయూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి ఉన్నత విద్యావంతుడని, విద్యారంగంపై మంచి అవగాహన కలిగిన వ్యక్తి అని అన్నారు. ఆయన తండ్రి టైగర్ దామోదర్ రెడ్డి ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేసిన గొప్ప నాయకుడని, అలాంటి త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన సర్వోత్తం రెడ్డికి పట్టభద్రులు ఆశీర్వాదం అందించాలని కోరారు. కాకతీయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించామని, అసెంబ్లీలోనూ యూనివర్సిటీ సమస్యలను ప్రస్తావించామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 19వ తేదీలోపు యూనివర్సిటీని సందర్శించే అవకాశం ఉందని, ఈ సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. గత మూడేళ్లలో వరంగల్ జిల్లాలో జరిగిన అభివృద్ధిని పరిశీలించి పట్టభద్రులు ఆలోచనాత్మకంగా ఓటు వేయాలని కోరారు. రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ మాట్లాడుతూ.. గత పదేళ్లలో విద్యారంగం ఎదుర్కొన్న నష్టాలను విద్యావంతులు గమనించాలని అన్నారు. ఈ ఎన్నికలు కేవలం ఒక రాజకీయ పార్టీకి సంబంధించినవి మాత్రమే కాదని, రాష్ట్రంలో విద్యా అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు తెలిపే ఎన్నికలని పేర్కొన్నారు. పట్టభద్రులు పనిచేసే నాయకత్వాన్ని గుర్తించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే గంద్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. తాను కూడా విద్యార్థి ఉద్యమాల నుంచి వచ్చిన వ్యక్తినని, కాకతీయ విశ్వవిద్యాలయంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని అన్నారు. యూనివర్సిటీలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు, ఖాళీ పోస్టులు, ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. వరంగల్‌ను రెండో రాజధానిగా అభివృద్ధి చేయాలనే ముఖ్యమంత్రి సంకల్పంలో భాగంగా విమానాశ్రయం, రహదారులు, వంతెనలు, యూనివర్సిటీ అభివృద్ధికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు.

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. తాను కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థినని గర్వంగా చెప్పుకుంటానని, యూనివర్సిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కాంట్రాక్ట్ లెక్చరర్లు, అధ్యాపకులు, విద్యార్థుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. విద్యావంతులైన (మిగతా 2లో..)

రైస్ బ్యాగుల్లో తక్కువ తూకం

- ట్రేడర్స్ యజమానిపై కేసు నమోదు
- నయీమ్ నగర్ లోని మూడు రైస్ దుకాణాలలో విస్తృత తనిఖీలు



హనుమకొండ, ఆయుధం: హనుమకొండ నయీమ్ నగర్ లోని గణపతి రైస్ ట్రేడర్స్, చిదర సంపత్ కుమార్ ఫుడ్ గ్రేన్ డీలర్, శ్రీ శ్యామ్ ట్రేడర్స్ దుకాణాలలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, పౌర సరఫరాల శాఖ అధికారులు, తూనికలు కొలతలు శాఖల అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా రైస్ బ్యాగుల తూకాలు సరిగ్గా ఉన్నాయా లేదా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైస్ విక్రయాలు జరుగుతున్నాయా అని అడిగి తెలుసుకుని వాటి రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు విక్రయాలు జరుగుతున్నాయా లేదా అని ఆరా తీశారు. కాగా గణపతి రైస్ ట్రేడర్స్ లో తనిఖీల సందర్భంగా అక్కడి బియ్యం బస్తాలను తూకం వేశారు. ఇందులో ఇరవై ఐదు కిలోల సంచులలో ఒక్కోదానిలో ఒకటి నుండి ఒకటిన్నర కిలోల వరకు తక్కువగా బియ్యం ఉన్నట్లు అదనపు కలెక్టర్, అధికారులు గుర్తించారు.



వినియోగదారులను మోసం చేస్తూ తక్కువ బరువు కలిగి ఉన్న బియ్యం సంచులను విక్రయిస్తున్నందుకు గణపతి రైస్ ట్రేడర్స్ యజమానిపై ప్రభుత్వ నిబంధనల మేరకు కేసు నమోదు చేసినట్లు అదనపు కలెక్టర్ రవి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ రైస్ విక్రయ దుకాణాలలో ప్రభుత్వ నిర్దేశిత ధరలకు మాత్రమే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా నిర్ణీత తూకం కంటే తక్కువ తూకం ఉన్న రైస్ బ్యాగులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీలలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మహేందర్, డిప్యూటీ తహసీల్దార్ నాగేంద్రప్రసాద్, ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు భద్రు నాయక్, భాస్కర్ రెడ్డి, తూనికలు కొలతల శాఖ అధికారులు విశ్వేశ్వర్, పాల్గొన్నారు.

ఏఈఈ పరీక్షలకు(సివిల్)పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- జిల్లాలో 2,660 మంది అభ్యర్థులు.. మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు



హనుమకొండ, ఆయుధం: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6, 7 తేదీల్లో నిర్వహించనున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (AEEసివిల్) రాత పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో పరీక్షల నిర్వహణకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. రవాణా, రోడ్లు, భవనాల శాఖలో ఏఈఈ (సివిల్) పోస్టుల భర్తీకి కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష (CBRT) నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు హనుమకొండ జిల్లాలో రెండు రోజుల్లో మొత్తం 2,660 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. నవంబర్ 6న 1,330 మంది, నవంబర్ 7న మరో 1,330 మంది పరీక్ష రాయనున్నారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు.

మూడు పరీక్ష కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వడ్డేపల్లిలో ని ఐఓఎస్ డిజిటల్ జోన్ ఐడీజెడ్ వరంగల్, గోపాల్‌పూర్ కల్లు మండువ సర్కిల్ సమీపంలోని ఎన్ఎస్ గ్లోబల్ టెక్నాలజీస్, హసన్‌పర్తిలోని హైవే పక్కన ఉన్న నోబెల్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యుత్, తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులను నియమించారు.

వైద్య, విద్యుత్, రవాణా ఏర్పాట్లు

పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష జరిగే రెండు రోజులూ మూడు కేంద్రాల్లో (మిగతా 2లో..)



సన్నూర్ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కలెక్టర్ డా. సత్యశారద
- ఆలయ అభివృద్ధి పనులను పరిశీలన

వరంగల్, ఆయుధం: రాయపర్తి మండలం సన్నూర్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని పాలకుర్తి శాసనసభ్యులు యశస్విని రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభం తో స్వాగతం పలికి ప్రత్యేక పూజల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయ పరిసరాలను పరిశీలించిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈ ప్రాంతం దేవాలయాలను మరియు పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ఆలయ అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సునీత, జడ్పి సీఈఓ వసంత, డిఆర్డిఓ నాగ పద్మజ, ఆర్డీవో సుమ, తహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, ఆలయ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ అభివృద్ధి ప్రాజెక్టులకు డీపీఆర్‌లు

- హనుమకొండ కలెక్టర్, జీడబ్ల్యూఎంసి ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి
- డీపీఆర్ లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్



హనుమకొండ, ఆయుధం: అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌కు సంబంధించి వరంగల్ నగరంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులపై కేంద్ర గృహ నిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ MoHUA) జాయింట్ సెక్రెటరీ, మిషన్ డైరెక్టర్ ఇషా ఇతర అధికారులు మంగళవారం న్యూఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వరంగల్ నగరానికి సంబంధించి స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు, ఖిలా వరంగల్‌లో మోటు అభివృద్ధి, వరంగల్ బస్ స్టేషన్, హనుమకొండ చౌరస్తా అభివృద్ధి, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టుల డీపీఆర్‌లపై సమీక్ష చేశారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి ప్రాజెక్టులకు సంబంధించి సమగ్ర వివరాలతో కూడిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా వరంగల్ నగరంలో భవిష్యత్తులో వరదలను నివారించేందుకు స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణం ఎంతో అవసరమని, ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను ఇప్పటికే తయారు చేశామని, ప్రాజెక్టుకు ఆమోదం తెలపాలని వివరించారు. అదేవిధంగా ఖిలా వరంగల్‌లో మోటు అభివృద్ధికి, హనుమకొండ చౌరస్తా,
మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ కు సంబంధించిన ప్రాజెక్టుల డీపీఆర్‌ల ను కూడా తయారు చేసి సమర్పించినట్లు కలెక్టర్ తెలిపారు. వరంగల్ నగరానికి సంబంధించి వివిధ అభివృద్ధి పనుల ప్రాజెక్ట్ ల డీపీఆర్‌ల పట్ల కేంద్ర గృహ నిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ, మిషన్ డైరెక్టర్ ఇషా కలియా సంతృప్తి వ్యక్తం చేశారు.
ఈ సమావేశంలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ రవికుమార్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అదాలత్‌లో సర్వోత్తమ్ రెడ్డి పర్యటన

హనుమకొండ, ఆయుధం: హనుమకొండలోని వరంగల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి న్యాయవాదులను కలిసి ఎమ్మెల్సీ ఓటు నమోదు ఓటు అభ్యర్థన కార్యక్రమం చేపట్టారు. ఉమ్మడి వరంగల్ జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం కోర్టు ప్రాంగణంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియను పరిశీలించారు. హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, పది ఏళ్ల పాలన ఇప్పుడున్న మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధిలో మార్పు ఉంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని.. అభివృద్ధికి ఓటేయాలని విజ్ఞులైన న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం అని న్యాయవాదులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామని, ఇంకా అనేక సమస్యలు చర్చించి సరియైన పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. న్యాయవాదులు అందరూ కూడా తమ ఓటు నమోదు చేసుకొని ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ నియోజకవర్గ ఎమ్మెల్సీ కన్వీనర్ తొగరు జగన్మోహన్ రెడ్డి, వరంగల్ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్, రాష్ట్ర లీగల్ సెల్ ప్రతినిధులు నిమ్మాని శేఖర్ రావు, నల్ల మహాత్మ, తోట రాజ్ కుమార్, వేముల రమేష్, జయకర్, శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ న్యాయవాదులు ఇందిరా నరసింహారావు, రవికుమార్, బార్ అధ్యక్ష కార్యదర్శులు సీనియర్, జూనియర్, మహిళ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



పన్ను వసూళ్ల లో పురోగతి కనిపించాలి

- బల్దియా కమిషనర్ టి.వెంకన్న
- రెవెన్యూ అధికారులతో పన్ను వసూళ్ల పై సమీక్ష....

వరంగల్, ఆయుధం: నగరంలో పన్ను వసూళ్లలో ఆశించిన పురోగతి కనిపించాలని, నిర్దేశిత లక్ష్యాలను సాధించే దిశగా రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కమిషనర్ పన్ను వసూళ్ల పురోగతిని సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రెండు సర్కిళ్ల పరిధిలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల వారీగా పన్ను వసూళ్ల తీరును సమీక్షించారు. ఆస్తి పన్ను వసూళ్లతోపాటు నీటి పన్ను వసూళ్లను కూడా సమాంతరంగా చేపట్టాలని, వసూళ్ల ప్రక్రియలో వేగం పెంచాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అర్థ భాగం ముగిసిన నేపథ్యంలో మిగిలిన కాలంలో పన్ను వసూళ్ల లక్ష్యాల సాధనకు ప్రతి రెవెన్యూ, అధికారి,ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పన్ను బకాయిల వసూళ్లపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, తదుపరి నిర్వహించే సమీక్షా సమావేశం నాటికి వసూళ్లలో స్పష్టమైన పురోగతి కనిపించాలని కమిషనర్ ఆదేశించారు.
ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కమిషనర్ సమ్మయ్య, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, బిర్రు శ్రీనివాస్, పన్నుల అధికారి రామకృష్ణ, రెవెన్యూ అధికారులు షహజాది బేగం, శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి

ప్రత్యేక కార్యాచరణ

(మొదటి పేజీ తరువాయి..)



సర్వోత్తం రెడ్డిని గెలిపిస్తే యూనివర్సిటీ సమస్యలను సమర్థంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగలరని అన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. కాకతీయ విశ్వవిద్యాలయ సమస్యలను గతంలోనూ ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని, కొన్ని సమస్యల పరిష్కారంపై స్పష్టత వచ్చిందని తెలిపారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మరిన్ని అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను కూడా దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తోందని చెప్పారు. గ్రాడ్యుయేట్లు రాజకీయ పరిస్థితులను, అభ్యర్థి విద్యార్హతలు, సామర్థ్యాన్ని పరిశీలించి ఓటు వేయాలని కోరారు.
శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య మాట్లాడుతూ.. కాకతీయ విశ్వవిద్యాలయం అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వాలకు ప్రత్యేక పాత్ర ఉందని గుర్తుచేశారు. యూనివర్సిటీకి ఇంజనీరింగ్ కళాశాల మంజూరు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ హయాంలోనే జరిగాయని తెలిపారు. సర్వోత్తం రెడ్డి మంచి కుటుంబ నేపథ్యం, రాజకీయ అనుభవం కలిగిన అభ్యర్థి అని, ఆయనను గెలిపించాలని కోరారు.
గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి మాట్లాడుతూ.. తాను కాకతీయ విశ్వవిద్యాలయంలో గోల్డ్ మెడలిస్ట్‌గా విద్యాభ్యాసం పూర్తి చేసి, అమెరికాలో ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో రెండు మాస్టర్స్ డిగ్రీలు పొందానని తెలిపారు. ఫైనాన్షియల్ స్ట్రాటజీ, ఇంటర్నేషనల్ మేనేజ్‌మెంట్‌లో ఉన్నత విద్య అనంతరం క్యాపిటల్ వన్ బ్యాంక్‌లో పనిచేసి అమెరికా, కెనడా, లండన్ తదితర దేశాల్లో కార్పొరేట్ రంగంలో పనిచేసిన అనుభవం ఉందన్నారు. రాజకీయ వ్యవస్థకు, కార్పొరేట్ రంగానికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 14 వేల కిలోమీటర్లు ప్రయాణించి పట్టభద్రులను కలిశానని, నియోజకవర్గ పరిధిలోని ప్రతి మండలానికి వెళ్లి సమస్యలను తెలుసుకుంటానని హామీ ఇచ్చారు.
కాకతీయ విశ్వవిద్యాలయంలో 489 రెగ్యులర్ పోస్టులు ఉండగా, ప్రస్తుతం 77 మంది మాత్రమే పనిచేస్తున్నారని, ఇంకా 332 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు, పార్ట్‌టైమ్ ఉద్యోగులు, గెస్ట్ ఫ్యాకల్టీ సమస్యలపై ఇటీవల మంత్రులు, ప్రజాప్రతినిధులతో చర్చించామని చెప్పారు. ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాధ్యమైన పరిష్కారాల కోసం కృషి చేస్తామని తెలిపారు.
ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత కూడా అందుబాటులో ఉంటూ ఉద్యోగులు, విద్యార్థులు, అధ్యాపకుల సమస్యలపై స్వతంత్రంగా తన గళాన్ని వినిపిస్తానని, సమస్యలను వినడమే కాకుండా వాటి పరిష్కారానికి పోరాడుతానని హామీ ఇచ్చారు. తన తండ్రి టైగర్ దామోదర్ రెడ్డి, కుటుంబ సభ్యులు ప్రజల కోసం చేసిన త్యాగాలను గుర్తు చేస్తూ, ప్రజల గుండెల్లో సంపాదించిన స్థానమే తమ కుటుంబానికి గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు.

గర్భిణులను మూడు నెలల్లోపే ఏఎన్‌సీ నమోదు చేయాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య



హనుమకొండ, ఆయుధం: హనుమకొండ జిల్లా పరిధిలో గర్భిణుల ముందస్తు నమోదు శాతం గట్లకానపర్తి ఉప కేంద్రం లో గత 3 నెలలుగా తక్కువగా ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా నుండి 4 సూపర్ వైసర్ బృందాలను ఏర్పాటు చేసి మానిటరింగ్ చేయుట కొరకు డాక్టర్ రజిత ప్రోగ్రాం ఆఫీసర్ ను నియమించినట్లు తెలిపారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లోని గట్లకానపర్తి గ్రామాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గర్భిణుల నమోదు స్థితిగతులను పరిశీలించి, ఇప్పటివరకు ఎంతమంది గర్భిణులు నమోదు అయ్యారు, ఇంకా ఎంతమంది నమోదు కావాల్సి ఉందనే వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల గుర్తింపు, ముందస్తు నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను సమీక్షించారు. ప్రతి గర్భిణిని మొదటి మూడు నెలల్లోనే గుర్తించి, తప్పనిసరిగా ANC నమోదు చేయాలని, గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన మందులు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో ఇంటింటి సర్వే నిర్వహించి, ఒక్క గర్భిణి కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని, ఏఎన్‌సీ నమోదు లక్ష్యాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని డీఎంహెచ్ఓ సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రజిత, పిహెచ్.యన్, శోభ, హెల్త్ సూపర్ వైజర్, రమాదేవి, పద్మజ, ఎంపీహెచ్ ఈవో సంపత్, భద్రయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత అధికారులదే

- పత్తి ధరలు తగ్గడంపై విచారణ జరిపించాలి
- రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కిషన్ రావు



వరంగల్, ఆయుధం: రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత మార్కెట్ అధికారులపై ఉందని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు అన్నారు. మంగళవారం తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ను సందర్శించి పత్తి రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు మాట్లాడుతూ పత్తి ధరల విషయంలో ఇతర వ్యవసాయ మార్కెట్ లతో పోలిస్తే ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ లో తక్కువ ధరలు లభించడంపై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, ఇక్కడ తక్కువ ధరలు లభించడానికి గల కారణాలపై విచారణ జరిపించాలన్నారు. మార్కెట్లో పారదర్శకమైన బహిరంగ వేలం నిర్వహించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. పత్తి కొనుగోళ్లలో వ్యాపారుల మధ్య కుమ్మక్కు లేదా ధరల నియంత్రణ జరుగుతుందా అని అంశాన్ని పరిశీలించాలన్నారు. రైతుల పత్తికి సరైన ధర నిర్ణయించేలా వ్యాపారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. పత్తి నాణ్యత, తేమశాతం పేరుతో రైతులకు అన్యాయం జరగకుండా నిబంధన ప్రకారం పరీక్షలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురువక పత్తి దిగుబడులు గణనీయంగా తగ్గాయన్నారు. ఎకరాకు రావలసిన దిగుబడిలో భారీగా కోత పడటంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగిరాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి సమయంలో పత్తికి సరైన ధర రాకపోవడం రైతులను మరింత ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసియాలోనే అతిపెద్ద రెండవ మార్కెట్ అయిన ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ రైతుల చెమటకు తగిన ప్రతిఫలం అందించే కేంద్రంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు చౌళ్ల రామారావు, జిల్లా కార్యదర్శి సురాబు బాబురావు, నాయకులు నాగుర్ల రాజీరు, భాషబోయిన కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం..

అరాచక శక్తులను తరిమికొడదాం

- వ్యవస్థలపై బురదజల్లడమే కాంగ్రెస్ నైజమా? ఓటర్ల సవరణపై రేవంత్, రాహుల్ ద్వంద్వ నీతి
- బీఎల్‌వోలను సంప్రదించడం చేతకాక ఢిల్లీకి ఎందుకు?
- ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ డ్రామా
- ప్రముఖ న్యాయవాది కొండపల్లి శ్రీధర్ రెడ్డి ఆగ్రహం



వరంగల్, ఆయుధం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ కార్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీలతో కూడిన కాంగ్రెస్ కూటమి దేశంలో అరాచక శక్తులను ప్రోత్సహిస్తూ, రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థలపై బురదజల్లుతోందని ప్రముఖ న్యాయవాది కొండపల్లి శ్రీధర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని వరంగల్ చౌరస్తాలో గల కే కన్వెన్షన్‌లో "సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ" ఆధ్వర్యంలో మేధావుల సదస్సు నిర్వహించబడింది. ప్రముఖులు కుసుమ సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో "ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం అరాచక శక్తులను తరిమికొడదాం", అనే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రముఖ న్యాయవాది కొండపల్లి శ్రీధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియ చట్టప్రకారం సక్రమంగా పూర్తయిన తర్వాతనే కదా కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. అక్కడ అధికారంలోకి వచ్చినప్పుడు సక్రమంగా అనిపించిన సవరణ ప్రక్రియ, ఇక్కడ తెలంగాణకు వచ్చేసరికి కాంగ్రెస్ కి ఎందుకు తప్పుగా కనిపిస్తోందని, అక్కడ లేని ప్రశ్నలు, అభ్యంతరాలు ఇక్కడ ఎందుకు లేవనెత్తుతున్నారని ఆయన గట్టిగా నిలదీశారు.
కాంగ్రెస్ కూటమి అధికారంలోకి రావడానికి ఒకలా, అధికారంలో ఉన్నప్పుడు మరొకలా ప్రవర్తిస్తూ ద్వంద్వ ప్రమాణాలను అవలంబిస్తోందని శ్రీధర్ రెడ్డి విమర్శించారు. ఓటర్ల జాబితాలో ఏవైనా సమస్యలు ఉంటే క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండే బూత్ లెవెల్ ఆఫీసర్ ను సంప్రదించి చట్టప్రకారం పరిష్కరించుకోవాలనే కనీస అవగాహన లేకుండా, ప్రతి చిన్న విషయానికి ఢిల్లీకి వెళ్లి రాజకీయం చేయడం కాంగ్రెస్ కూటమి అరాచక వైఖరికి, వ్యవస్థలపై వారికి ఉన్న అగౌరవానికి నిదర్శనమని మండిపడ్డారు. నేటి ఆధునిక సమాజంలో, ముఖ్యంగా జెడ్ జెనరేషన్ యువతను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న అరాచకాలు, వికృత చేష్టలు పరాకాష్టకు చేరాయి. దేశ భవిష్యత్తును మార్చాల్సిన యువతను తప్పుదోవ పట్టిస్తూ, వారి వెనుక దాక్కుని రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోంది. సదస్సులో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మేధావులు, యువత, విద్యావంతులు నడుం బిగించాలని, ఓటు హక్కు నమోదును ఒక సామాజిక బాధ్యతగా చేపట్టాలని పిలుపునిచ్చారు. మేధావులు, విద్యావంతులు, మరియు చైతన్యవంతమైన యువత ఈ అరాచక శక్తుల వెనుక ఉన్న అసలు రంగును గుర్తించాలి. ఇలాంటి వికృత రాజకీయాలను తిప్పికొట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందనీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నగరానికి చెందిన పలువురు ప్రముఖ మేధావులు, న్యాయవాదులు, విద్యాసంస్థల ప్రతినిధులు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొని సదస్సులో అంశాలపై చర్చించి విజయవంతం చేశారు.



గుంటూరులో టీడీపీ జోరు..

- మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణ ఘన విజయం

గుంటూరు, ఆయుధం: గుంటూరులో తెదేపా జోరు కొనసాగుతోంది. తెదేపా మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ ఘన విజయం సాధించారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 76 డివిజన్లకు గాను అత్యధిక స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. లక్ష్మీ అపర్ణ విజయంతో తెదేపా శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. చిత్తూరు, తిరుపతిలో తెదేపా మేయర్ అభ్యర్థులు కఠారి హేమలత, మన్నె శ్రీనివాస ప్రసాద్ గెలుపొందారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పురపోరులో కూటమి జైత్రయాత్ర కొనసాగుతోంది.



దివ్యాంగుల మధ్య బేతి మనోజ్ఞ జన్మదిన వేడుకలు

- అన్నదానం, పండ్ల పంపిణీ

వరంగల్, ఆయుధం: కాశిబుగ్గలోని మదర్ తెరిసా ఫౌండేషన్‌లో బేతి మనోజ్ఞ జన్మదినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల మధ్య కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ, పుట్టినరోజు వేడుకలను కేవలం కుటుంబ సభ్యుల మధ్య జరుపుకోవడమే కాకుండా, దివ్యాంగుల మధ్య జరుపుకుంటూ వారికి అన్నదానం చేయడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వం, సేవాభావం, సాటి మనిషి పట్ల ప్రేమను పెంపొందిస్తాయని తెలిపారు. సేవే మానవత్వానికి ప్రతిరూపం - పుట్టినరోజు వేడుకల్లో బేతి మనోజ్ఞ సేవా స్ఫూర్తిని చాటారు. ఈ కార్యక్రమంలో బేతి వీరలక్ష్మి, బేతి రాజు, బేతి శ్వేత, బేతి శోభారాణి, దివ్య, సాయి, నాని, చారీ, మదర్ తెరిసా ఫౌండేషన్ వారు తదితరులు పాల్గొన్నారు.

ఏఈఈ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి..)
నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులకు సూచించారు. అభ్యర్థుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అదనపు బస్సులు నడపాలని, బస్సుల ఫ్రీక్వెన్సీ పెంచాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు.

పటిష్ట పోలీసు బందోబస్తు

పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 7 గంటల నుంచి పరీక్షలు పూర్తయ్యే వరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో మూడు కిలోమీటర్ల పరిధిలోని జిరాక్స్ కేంద్రాలను పరీక్షల సమయంలో మూసివేయించాలని తెలిపారు. అభ్యర్థులకు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, మహిళా అభ్యర్థుల తనిఖీలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్లను వినియోగించాలని ఆదేశించారు. సెల్‌ఫోన్లు, బ్లూటూత్‌తో పాటు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష హాళ్లలోకి అనుమతించకూడదని స్పష్టం చేశారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహా పరీక్ష విధుల్లో పాల్గొనే ఇతర అధికారులు, సిబ్బంది కూడా తమ సెల్‌ఫోన్లను ప్రవేశ ద్వారం వద్దే అప్పగించాలని సూచించారు. పరీక్ష ప్రారంభానికి ముందుగా ఉదయం 8 గంటలకు పరీక్ష గదులు, విధుల్లో ఉన్న సిబ్బందిని పోలీసులు తనిఖీ చేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ట్రాఫిక్ నియంత్రణ చేపట్టి అభ్యర్థుల రాకపోకలకు ఆటంకాలు లేకుండా చూడాలని ఆదేశించారు. . ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ శాఖ అధికారి శ్రీనివాస్, డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, ఆర్టీసీ డిఎం ధరంసింగ్, పోలీస్ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్, కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీ శంకర్, ఇతర శాఖల అధికారులతో పాటు పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి మాత ఆలయంలో చాగంటి పూజలు

వరంగల్, ఆయుధం: వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని మంగళవారం ఉదయం ఆధ్యాత్మికవేత్త ప్రముఖ ప్రవచనకర్త డా. చాగంటి కోటేశ్వర రావు సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన కోటేశ్వర రావు కు ఆలయ చైర్మన్ డా॥ బి.శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మయూరి రామేశ్వరావు, కమటం వేణుగోపాల్, మాడిశెట్టి సతీష్, కల్లూరి పవన్ కుమార్, చిదురాల అంజనీదేవి, పేరాల శ్రీనివాస రావు, రమేష్ చంద్ భంగ్, డా॥ వాసవీ రెడ్డి, ప్రధానార్చకులు భద్రకాళి శేషులు పూర్ణకుంభంతో, వేదస్వస్తితో ఘనస్వాగతం పలికారు. ముందుగా గోకులంలో గోప్రదక్షిణ చేసి అనంతరం శ్రీ వల్లభ గణపతిని దర్శించిన తర్వాత అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహామంపడపంలో అర్చకులు, వేద పండితులు మహదాశీర్వచనం నిర్వహించిన తదుపరి భక్తులను ఉద్దేశ్యించి తమ ప్రవచనం జరిపారు. ఈ సందర్భముగా చాగంటి కోటేశ్వరరావు ను వారి ప్రవచనం వినుటకు అనేక మంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695